సాక్షి
విశాఖపట్నం
సోమవారం : 17 : జూలై : 2023



ఎక్స్‌లెంట్‌గా మానసిక ఆస్పత్రి

అధునాతన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వ మానసిక ఆస్పత్రి మరో ముందడుగు వేస్తోంది. 8లో



ఈట్‌రైట్.. నో డౌట్

ఈట్ రైట్ స్టేషన్ గుర్తింపు గత ఏడాది విశాఖకు లభించగా తాజాగా విజయనగరం, శ్రీకాకుళం రైల్వేస్టేషన్లకు లభించింది. 8లో



రెండో సెమిస్టర్ బుక్స్ సిద్ధం

రెండో సెమిస్టర్ పుస్తకాలు సైతం సకాలంలో పంపిణీ చేసేలా జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. 10లో

సురక్ష.. సూపర్‌హిట్

- జిల్లాలో 383 సచివాలయాల పరిధిలో క్యాంపుల పూర్తి
- 82,973 టోకెన్లు జారీ చేసిన వలంటీర్లు
- వారం రోజుల వ్యవధిలో 76,895 ధ్రువపత్రాల జారీ
- కేవలం 1,903 దరఖాస్తుల తిరస్కరణ



జగనన్న సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం : సంక్షేమ పథకాల అమలులో ఏ ఒక్కరూ మిగిలిపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన మరో ప్రతిష్టాత్మక కార్యక్రమం జగనన్న సురక్ష సూపర్‌హిట్ అయింది. సురక్ష క్యాంపులకు జిల్లాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు 383 సచివాలయాల పరిధిలో నిర్వహించిన సురక్ష కార్యక్రమం ద్వారా 76,895 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా మంజూరు చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు సారధులుగా వ్యవహరిస్తున్న వలంటీర్లు.. ఈ కార్యక్రమంలో ముఖ్య భూమిక పోషించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అవసరమైన ధ్రువపత్రాల గురించి ఆరా తీస్తూ.. సురక్షకు దరఖాస్తు చేయించారు. ఫలితంగా ఏళ్ల తరబడి మంజూరు కాని ధ్రువపత్రాలు వారం రోజుల వ్యవధిలో చేతికందడంతో లబ్ధిదారులంతా ఖుషీ ఖుషీగా ఉన్నారు.

82,973 టోకెన్ల జారీ

జూన్ 23న ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన తర్వాత సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటినీ జల్లెడ పడుతున్నారు. అర్హత ఉండి కూడా.. వివిధ కారణాల వల్ల పథకాలు అందని, అలాగే సర్టిఫికెట్లు పొందని వారి వివరాల్ని సేకరించారు. ఈ సర్వీసులన్నింటినీ రిజిస్టర్ చేసిన వలంటీర్లు వారికి టోకెన్లు ఇచ్చారు. అధికారులు వీటిని పరిశీలించి జగనన్న సురక్ష క్యాంపులకు వెళ్లేముందే పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతున్నారు. ఆయా సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 383 సచివాలయాల పరిధిలో క్యాంపులు జరగ్గా 82,973 టోకెన్లు జారీ చేశారు. ఇందులో 76,895 ధ్రువపత్రాలను ఆయా సచివాలయాల పరిధిలో వారం రోజుల వ్యవధిలో లబ్ధిదారులకు జారీ చేశారు. ఇప్పటివరకు 1,903 దరఖాస్తులు మాత్రమే తిరస్కరణకు గురయ్యాయి.

సులభంగా ధ్రువీకరణ పత్రాలు : ఒకప్పుడు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. కానీ.. సురక్షతో కేవలం దరఖాస్తు చేసుకుంటే చాలు.. వారికి కావల్సిన పత్రాల్ని క్యాంపుల్లో వారం రోజుల్లో అందజేస్తున్నారు. ఇప్పటి వరకు జారీ చేసిన సర్టిఫికెట్స్‌లో ఎక్కువగా ఇంటిగ్రేటెడ్, ఆదాయ, కులం ధ్రువీకరణ పత్రాలున్నాయి. అదేవిధంగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఖరీఫ్ సీజన్ కావడంతో సీసీఆర్సీ కార్డులు పొందడానికి చాలామంది కౌలు రైతులకు ఈ క్యాంపులు బాగా ఉపయోగపడ్డాయి. మ్యుటేషన్ కోసం చాలా మంది తమ సర్వీసులను రిజిస్టర్ చేసుకున్నారు.

సురక్ష క్యాంపుల్లో లబ్ధి ఇలా..

మండలం/జోన్	క్యాంపులు పూర్తైన సచివాలయాలు	పూర్తి చేసిన హౌస్‌హోల్డ్ సర్వే ఇళ్లు	జారీ చేసిన టోకెన్లు	జారీ చేసిన ధ్రువపత్రాలు
ఆనందపురం	12	2358	3753	3554
భీమునిపట్నం	09	1276	1881	1761
పద్మనాభం	04	980	577	386
పెందుర్తి	08	3942	8372	8047
జీవీఎంసీ జోన్-1	21	6849	7504	6836
జీవీఎంసీ జోన్-2	76	10079	10929	9916
జీవీఎంసీ జోన్-3	58	8280	13269	9994
జీవీఎంసీ జోన్-4	32	4090	6203	5825
జీవీఎంసీ జోన్-5	68	10835	12988	12344
జీవీఎంసీ జోన్-6	63	8431	11409	10088
జీవీఎంసీ జోన్-8	32	7101	8611	8144
మొత్తం	383	64221	82973	76895

ఏఏ ధ్రువపత్రాలు పొందారంటే...

సేవలు	దరఖాస్తులు	జారీ చేసినవి
ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్	41,831	33,725
కొత్త ఆదాయ ధ్రువీకరణ	21,484	18,411
ఓబీసీ సర్టిఫికెట్	544	285
ఇన్‌కమ్ సర్టిఫికెట్ రెన్యువల్	3536	3536
ఇంటిగ్రేటెడ్ రెన్యువల్	6280	6280
రైస్ కార్డు స్ప్లిట్టింగ్	129	114
కొత్త రైస్ కార్డులు	280	240
రైస్‌కార్డులో అదనపు మెంబర్	867	755
ఆరోగ్యశ్రీ కార్డులు అప్‌డేట్, కొత్త కార్డుల జారీ	194	194



ధ్రువపత్రాలతో లబ్ధిదారులు



ధ్రువపత్రాలు అందిస్తున్న గుర్రంపాలెం సర్పంచ్

ఈ నెల 26 వరకు సురక్ష శిబిరాలు



జగనన్న సురక్ష క్యాంపులకు మంచి స్పందన లభిస్తోంది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వో నిరంతర పర్యవేక్షణలో లబ్ధిదారులకు అవసరమైన సేవలందిస్తున్నాం. క్యాంపుల్లో అక్కడిక్కడే సర్టిఫికెట్లు జారీచేసేందుకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశాం. క్యాంపుల వద్ద రిసెప్షన్ డెస్క్, సర్వీస్ రిజిస్ట్రేషన్ డెస్క్, జగనన్నకు చెబుదాం, వెరిఫికేషన్ డెస్క్, ఆధార్ డెస్క్ ఇలా.. ప్రజలకు అందుబాటులో ఉండేలా సేవల్ని విభజన చేసి ధ్రువపత్రాలు మంజూరు చేస్తున్నాం. ఈ నెల 26 వరకూ జిల్లాలో సురక్ష క్యాంపులు జరగనున్నాయి.

– పూర్ణిమాదేవి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల ఇన్‌చార్జ్

థ్యాంక్యూ జగనన్నా..



మేము తూర్పు కాపు కులానికి చెందిన వాళ్లం. కుల ధ్రువీకరణ పత్రం కోసం చాలా సార్లు తహసీల్దార్ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకున్నాం. మైగ్రేషన్ సర్టిఫికెట్ కావాలని రెవెన్యూ అధికారులు చెప్పారు. దాని కోసం మళ్లీ తిరిగే ఓపిక లేక.. మా ఇంట్లో వాళ్లు వద్దని చెప్పేశారు. ఇప్పుడు మా మహిళా వలంటీర్ ఇంటికి వచ్చి జగనన్న సురక్ష పథకం గురించి వివరించారు. మీకు ఏ సహాయం కావాలని ఆమె అడిగితే, తూర్పు కాపు కులానికి చెందిన వాడినని, నాకు బీసీ–డీ సర్టిఫికెట్ కావాలన్నారు. వెంటనే వివరాలు నమోదు చేసుకొని క్యాంపులో సర్టిఫికెట్ చేతికి అందించారు. థాంక్యూ జగనన్న.

– బొండా లక్ష్మణ ఆదిత్య, చినగంట్యాడ

ప్రజల వద్దకే పాలన కళ్లారా చూశాను



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ప్రజల వద్దకు పాలన కళ్లారా చూశాను. గత వారం సీతమ్మధార సచివాలయం సిబ్బంది, వలంటీర్లు మా ఇంటికి వచ్చి సురక్ష కార్యక్రమం గురించి వివరించారు. మా అమ్మాయి చదువుతున్న ఇంజనీరింగ్ కళాశాలలో కుల ధ్రువీకరణ పత్రం అడుగుతున్నారని చెప్పాను. నా ఆధార్, కుంటుంబ సభ్యుల వివరాలు, సింహాచలం దేవస్థానం ఇచ్చిన శ్రీ వైష్ణవ శాఖా ధ్రువీకరణ పత్రం అందజేశాను. ఆ తర్వాత సచివాలయ అడ్మిన్ శివప్రసాద్ చాలా త్వరగా ప్రోసెస్ చేశారు. దరఖాస్తు చేసిన రెండు రోజుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం లాంచింగ్ రోజే కుల ధ్రువీకరణ పత్రం నా చేతుల్లో పెట్టారు.

– కె.రాఘవాచార్యులు, విశ్రాంత తెలుగు విభాగాధిపతి, సీతమ్మధార

రెండు రోజుల్లోనే ధ్రువపత్రం



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పలు ధ్రువపత్రాలు సులువుగా అందిస్తున్నారు. ఎక్కడికీ వెళ్లకుండా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటికే వచ్చి అవసరమైన ధ్రువపత్రాల వివరాలు తెలుసుకున్నారు. ఆదాయ ధ్రువపత్రం నాకు అవసరం. ఈ సర్టిఫికెట్‌కు సంబంధించిన దరఖాస్తు నింపి సచివాలయానికి తీసుకెళ్లారు. రెండు రోజుల్లోనే ఆదాయ ధ్రువపత్రం అందజేశారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– రమా, మల్కాపురం

విద్యతోనే బీసీల అభ్యున్నతి

- సీఎం జగన్ గొప్ప సంఘ సంస్కర్త
- దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో బీసీల అభ్యున్నతి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య
- ఉత్సాహంగా విశాఖ బీసీ గర్జన



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు

బీచ్‌రోడ్డు : బీసీల అభ్యున్నతి, ఆత్మ గౌరవం అనేది విద్యతోనే సాధ్యమౌతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ ఆధ్వర్యంలో ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం 'విశాఖ బీసీ గర్జన' నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఒక సామాజిక వర్గం అభివృద్ధి చెందాలంటే విద్య, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. దానికి ప్రభుత్వాల చేయూత కూడా అవసరమన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి బీసీలను పట్టించుకోలేదన్నారు. విద్య,రాజకీయ, ఆర్థికంగా ఎదగాలని చెప్పిన గొప్ప నాయకుడు జగన్ అని కొనియాడారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంఘ సంస్కర్త కావడంతో అన్ని వర్గాల అభ్యున్నతి చెందుతున్నాయన్నారు. ముఖ్యంగా బీసీలకు చట్టసభల్లో అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. అప్పట్లో వైఎస్ రాజశేఖర రెడ్డి, ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీల ఉన్నత చదువుల కోసం ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. చాలా రాష్ట్రాల్లో తాను పర్యటించానని, బీసీ వర్గాలకు చెందిన పిల్లలు స్కూల్స్‌కు దూరంగా ఉంటున్నారన్నారు. ఏపీలో మాత్రం ప్రతీ ఒక్కరికీ విద్యను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. జాతీయ స్థాయిలో బీసీలు సాధించాల్సిన అంశాలు చాలా ఉన్నాయని వాటిపై పోరాడతామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో బీసీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు.

బీసీలంటే బ్యాక్‌వార్డ్ క్లాస్ కాదు.. బ్యాక్‌బోన్

బీసీలంటే బ్యాక్‌వార్డ్ క్లాస్ కాదు బ్యాక్‌బోన్ అని చెప్పిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కృష్ణయ్య పేర్కొన్నారు. అన్ని రంగాల్లో బీసీలకు సముచిత అవకాశం కల్పిస్తున్నట్టు రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చెప్పారు. 1997 నుంచి 2004 మధ్య కాలంలో బీసీల ఉన్నత చదువులకు చంద్రబాబు దూరం చేశారన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టడంతో లక్షలాది మంది బీసీలు బీటెక్‌లు పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారన్నారు. అదే బాటలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అనంతరం బీసీ కమిషన్ మాజీ సభ్యుడు పక్కి దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహం నుంచి బీసీ నేతలంతా ఆర్.కృష్ణయ్యను ఊరేగింపుగా సభా ప్రాంగణానికి తీసుకొచ్చారు.

వలంటీర్లకు వందనం..

కరోనా కాలంలో ఇంటింటికీ వెళ్లి సేవ చేసిన వలంటీర్లకు బీసీ సంక్షేమ సంఘం వందనం చేసింది. వలంటీర్ల వ్యవస్థతో బీసీ వర్గాలకు పథకాలు ఇంటికే చేరుతున్నాయని, అటువంటి సేవకులను ప్రతీ ఒక్కరూ గౌరవించాలని కోరారు.

కేజీహెచ్‌లో 'ఈ–హాస్పటల్'

- రోగి ఆధార్ కార్డుకు అనుసంధానం చేస్తూ పీఏసీఎస్ నెట్‌వర్క్
- అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే..
- త్వరలోనే అందుబాటులోకి..



మహారాణిపేట : కేజీహెచ్ వైద్యపరంగానే కాకుండా టెక్నాలజీని కూడా అందిపుచ్చుకుంటోంది. రోగులకు సరళతరమైన సేవలు అందిస్తోంది. త్వరలోనే 'ఈ– హాస్పటల్' విధానం అమల్లోకి రానుంది. ఇందుకు అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రోగుల ఆధార్ కార్డును పిక్చర్ ఆర్కైవింగ్ కమ్యూనికేషన్ సిస్టమ్‌కు (పీఏసీఎస్) అనుసంధానం చేస్తున్నారు. రోగి వివరాలను అన్ని విభాగాలకు వెళ్లేలా ల్యాన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ విధానం వల్ల కేజీహెచ్‌కు ఆర్థికంగా ఎంతో ఆదా అవుతోంది. ఈ ప్రక్రియకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున అనుమతి ఇవ్వడంతో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ సాధ్యమైనంత త్వరలో అమలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

రోగి వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం

పిక్చర్ ఆర్కైవింగ్ కమ్యూనికేషన్ సిస్టమ్ (పీఏసీఎస్) వ్యవస్థ ద్వారా రోగి వైద్య నివేదికలు ఆన్‌లైన్‌లో భద్రపరుస్తారు. ఎక్స్‌రేలు, న్యూక్లియర్ మెడిసిన్ ఇమేజింగ్, కార్డియాలజీ, డెర్మటాలజీ విభాగాలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

ఎస్‌బీఐ సీఎస్‌ఆర్ నిధుల నుంచి..

'ఈ– హాస్పటల్' విధానం ఏర్పాటుకు సుమారు రూ.50 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా. ఈ నిధులు సమకూర్చేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చింది. సీఎస్‌ఆర్ ద్వారా ఈ సహకారం అందిస్తామని తెలియజేసింది.

ఆధార్‌తో అనుసంధానం

ఇకపై కేజీహెచ్‌కు వచ్చే ప్రతీ రోగి ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి. ఓపీలో రూ.5 ఇచ్చి వివరాలు నమోదు చేసుకుంటే వెంటనే రోగి పేరుతో ఐడీ నంబర్ క్రియేట్ అవుతుంది. రోగులు చెల్లించే ప్రతి రూపాయి ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి చేరుతాయి. రోగి డేటా అంతా ఆన్‌లైన్‌లో నిక్షిప్తంగా ఉంటుంది.

రోగి సెల్‌ఫోన్‌కు అనుసంధానం

అవుట్ పేషంట్ (ఓపీ) టికెట్ జారీ, కే షీట్, ల్యాబ్‌లో జరిగే వివిధ పరీక్షలు, ఈసీజీ, కార్డియాలజీలో చికిత్సల వివరాలు రోగి సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేస్తున్నారు. వైద్యుల చికిత్స అనంతరం ట్రీట్‌మెంట్, ఇతర సలహాలు, మందుల వివరాలు అన్ని సెల్‌ఫోన్ ద్వారా రోగికి చేరుతాయి.

అంతా ఆన్‌లైన్‌లోనే..

కేజీహెచ్‌లో జనన, మరణాల ధ్రువీకరణ పత్రాల కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఇక నుంచి ఆస్పత్రిలో వీటిని కూడా ఆన్‌లైన్ విధానం అమలు చేయనున్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంబంధీకులకు ధ్రువపత్రాలు అందించే వెసులుబాటు కలగనుంది. దీంతో ఏడాదికి కేజీహెచ్‌కు రూ.కోటి ఆదా కానుంది.

సాధ్యమైనంత త్వరగా..



త్వరలోనే కేజీహెచ్‌లో 'ఈ హాస్పటల్' విధానాన్ని అమలు చేస్తాం. కలెక్టర్ మల్లికార్జున అనుమతితో దీనికయ్యే ఖర్చును భరించడానికి ఎస్‌బీఐ ముందుకు వచ్చింది. ఈ వ్యవస్థ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో అమల్లో ఉంది. రోగులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– డాక్టర్ పి.శివానంద్, సూపరింటెండెంట్, కేజీహెచ్

ముున్ముందు ఈ-సిటీ బస్సులే!

- దశల వారీగా విశాఖకు కేటాయింపు
- కాలం చెల్లిన బస్సుల స్థానంలో వీటికి చోటు
- డీజిల్ బస్సులకు క్రమంగా స్వస్తి



విద్యుత్ బస్సు

సాక్షి, విశాఖపట్నం : నగరాల్లో కాలుష్య తీవ్రత రోజురోజుకూ అధికమవుతోంది. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, వాహనాల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరుగుదల ఇందుకు కారణమవుతోంది. ఇలా కాలుష్యాన్ని వెదజల్లే డీజిల్ వాహనాలను నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులోభాగంగా కాలుష్య కారక డీజిల్ ఆర్టీసీ బస్సుల స్థానంలో కాలుష్య రహిత విద్యుత్ బస్సులను ప్రవేశ పెడుతున్నాయి. వచ్చే ఐదేళ్లలో ఆర్టీసీ డీజిల్ బస్సులకు బదులు ఎలక్ట్రిక్ (ఈ) బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నాయి.

తొలి దశలో విశాఖకు 100 కేటాయింపు

రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి కొత్తగా వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయనుంది. వీటిలో రాష్ట్రంలోనే అతి పెద్ద నగరమైన విశాఖకు 200 వరకు కేటాయించే అవకాశం ఉంది. తొలిదశలో 100 విద్యుత్ బస్సులు కేటాయించాలని గతంలోనే ఆర్టీసీ అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు. విశాఖలో ప్రస్తుతం 525 సిటీ బస్సులున్నాయి. వాహనాల తుక్కు విధానంలో భాగంగా 15 ఏళ్ల దాటిన బస్సులను సేవల నుంచి తొలగిస్తున్నారు. ఇలా తొలగించిన డీజిల్ బస్సుల స్థానంలో దశల వారీగా ఈ–బస్సులను సమకూరుస్తారు.

15 ఏళ్లు దాటిన 35 సిటీ బస్సుల తొలగింపు

విశాఖ జిల్లా ప్రజా రవాణా విభాగంలో ఈ సంవత్సరం 35 ఆర్టీసీ సిటీ బస్సులను తొలగించారు. అయితే ప్రస్తుతానికి విద్యుత్ బస్సులు అందుబాటులో లేకపోవడంతో వాటి స్థానంలో కొత్తగా డీజిల్ బస్సులనే ప్రవేశపెడుతున్నారు. వచ్చే ఏడాది ఆఖరునాటికి మరో 150 వరకు సిటీ బస్సులు 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకోనుండడంతో వీటిని కూడా సేవల నుంచి తప్పించనున్నారు. డిమాండ్‌కు సరిపడా విద్యుత్ బస్సుల ఉత్పత్తి జరగక పోవడంతో వీటి సరఫరాలో జాప్యం జరుగుతోంది. అందువల్ల విశాఖకు తొలి ఈ–బస్సు రాకకు ఏడాది సమయం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తొలుత ఈ–బస్సులు సిటీ సర్వీసులుగా నడుపుతారు. కొన్నాళ్ల తర్వాత ఇతర సర్వీసులుగానూ తిప్పుతారు.

సింహపురిలో ప్రత్యేక డిపో

విశాఖలో ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ కోసం ఉన్నతాధికారులు దృష్టి సారిస్తున్నారు. సింహాచలం వద్ద సింహపురి లేఅవుట్‌లో ఉన్న ఆర్టీసీ స్థలంలో ఈ–బస్సుల ప్రత్యేక డిపో, గ్యారేజీని ఏర్పాటు చేయనున్నారు. కొన్నాళ్ల క్రితం ఆ స్థలాన్ని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు పరిశీలించారు.

దువ్వాడ నుంచి 10 నిమిషాలకొక బస్సు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు ప్రతి పది నిమిషాలకు సిటీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. దువ్వాడ రైల్వేస్టేషన్ 4వ నంబర్ ప్లాట్‌ఫాం నుంచి 38వై, 55వై, 55పీ, 311 సిటీ బస్సు లు నడుపుతున్నట్టు పేర్కొన్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి కూర్మన్నపాలెం –ఆర్టీసీ కాంప్లెక్స్, సింహాచలం, సబ్బవరం వరకు సర్వీస్‌లు నడుపుతున్నట్టు చెప్పారు.

న్యూస్‌రీల్

టమాటాలతో తులాభారం



నూకాంబిక ఆలయంలో టమాటాలతో నిర్వహించిన తులాభారం

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో ఆదివారం వినూత్నరీతిలో తులాభారం నిర్వహించారు. వ్యాపారవేత్త మళ్ల జగ్గ అప్పారావు, మోహిని దంపతులు తమ కుమార్తె భవిష్యకు తులాభారం వేస్తామని అమ్మవారికి మొక్కుకున్నారు. టమాటాలు, బెల్లందిమ్మలు, పంచదార 51 కిలోల చొప్పున తులాభారం వేసి అమ్మవారికి సమర్పించారు. వీటితోపాటు జీడిపప్పు, కిస్మిస్ కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరిగా నూకాంబిక



అనకాపల్లిటౌన్: పట్టణంలో గవరపాలెం నూకాంబిక అమ్మవారు భక్తులకు శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం కావడంతో వ్యాపారవేత్త మళ్ల జగ్గ అప్పారావు సహకారంతో అమ్మవారి మూలవిరాట్‌కు పలు రకాల పండ్లతో అలంకరించినట్టు ఆలయ ఈవో బండారు ప్రసాద్ చెప్పారు. అమ్మవారి దర్శనం కోసం అధికసంఖ్యలో భక్తులు బారులుతీరారు.

హెచ్‌ఎంల సంఘ నూతన కార్యవర్గం



ప్రమాణం చేస్తున్న హెచ్‌ఎంల సంఘ సభ్యులు

ఆరిలోవ: రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యవర్గం సమావేశం ఆదివారం ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా జోగారావు, అధ్యక్షుడిగా ఆర్.సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.వి.కృష్ణకుమార్, స్టేట్ కౌన్సిలర్లగా వై.వి.ఎస్.వేణుగోపాల్, కె.రమణ, పి.జ్యోతి తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్ మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణ నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. పాఠశాలల్లో డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరారు.

బాల్ బ్యాడ్మింటన్ కోచ్ పోలిరెడ్డికి సత్కారం



పోలిరెడ్డిని అభినందిస్తున్న అధికారులు

మహారాణిపేట : బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కోచ్‌గా నియమితులైన బుల్లయ్య కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ పి.పోలిరెడ్డిని ఆదివారం పలువురు అధికారులు పోర్టు స్టేడియంలో సన్మానించారు. ప్రపంచ ఇంటర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఇండియన్ యూనివర్సిటీ జట్టుకు కోచ్ కమ్ మేనేజర్‌గా పోలిరెడ్డి నామినేట్ అయ్యారు. ఆగస్టు 8వ తేదీ నుంచి చైనాలో జరగనున్న పోటీలకు పోలిరెడ్డి కోచ్‌గా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్(ఎన్ఐసీ) అధికారి భాష, ఏసీపీ శ్రీనివాస్, పోర్టు అధికారి కుమార్ రాజా తదితరులు పోలిరెడ్డిని సత్కరించారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

కలెక్టరేట్‌లో..

కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

'స్వదేశీ' ఇలా.. 'విదేశీ' అలా!




మన దేశ సంస్కృతి, సంప్రదాయాలకు విదేశీయులు ఆకర్షితులవుతున్నారు. అందుకు భిన్నంగా స్వదేశీయులు పాశ్చాత్య పోకడలపై మోజు పడుతున్నారు. వస్త్ర ధారణలో యువతులు ఒకరినొకరు అనుసరిస్తున్నారు. అలాంటి దృశ్యమే ఆదివారం సాగరతీరంలో ఆవిష్కృతమైంది. బీచ్ రోడ్డులో పొరుగు రాష్ట్రానికి చెందిన ఓ యువతి మోడరన్ డ్రెస్‌తో విదేశీ స్టైల్లోను, విదేశీ యువతి తెలుగు సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే లంగా ఓణీతోను కనిపించారు. కొద్ది దూరంలోనే వీరిద్దరూ ఇలా విభిన్న వస్త్ర ధారణతో చూపరులను, సందర్శకులను ఆకర్షించారు.

ఫొటోలు : పీఎల్ మోహన్‌రావు, సాక్షి ఫొటోగ్రాఫర్

ఎక్స్‌లెంట్‌గా మానసిక ఆస్పత్రి

- మానసిక రోగులకు మెరుగైన వైద్యసేవలు
- సెంటర్‌ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ప్రభుత్వ మానసిక ఆస్పత్రి
- సిద్ధమైన అకడమిక్ బ్లాక్
- నూతనంగా మూడు కోర్సులు


నిర్మించిన నూతన వార్డులు



నూతనంగా నిర్మించిన అకడమిక్‌బ్లాక్

ఏయూక్యాంపస్ : అధునాతన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వ మానసిక ఆస్పత్రి మరో ముందడుగు వేస్తోంది. నూతనంగా ఏర్పాటైన సెంటర్ ఆఫ్‌ఎక్స్‌లెన్స్‌తో సమర్థవంతమైన సేవలను రోగులకు అందించే దిశగా సమాయత్తమవుతోంది. రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తున్న పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి స్వరూపం పూర్తిగా మారి రోగులకు మరింత విస్తృత సేవలు అందించే దిశగా సెంటర్ ఆఫ్‌ఎక్స్‌లెన్స్ నిలవనుంది. నూతనంగా మూడు కోర్సులతో అదనపు బోధన సిబ్బంది సమకూరనున్నారు.

రూ.29 కోట్లతో అకడమిక్ బ్లాక్

కేంద్ర ప్రభుత్వం విశాఖలోని దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రభుత్వ మానసిక ఆస్పత్రిని సెంటర్‌ఆఫ్‌ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా రూ.29 కోట్లతో అకడమిక్ బ్లాక్, ఇతర వార్డులను నిర్మించారు. దీనిలో కేంద్ర ప్రభుత్వం వాటా 60 శాతం కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతంగా ఉంది. ఇప్పటికే భవనాల నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమయ్యాయి. కొద్ది రోజుల్లో ఇవి పూర్తిస్థాయిలో సేవలు అందించనున్నాయి.

మూడు కోర్సులు ప్రారంభం

అకడమిక్ బ్లాక్ నిర్మాణం పూర్తికావడంతో సెంటర్ ఆఫ్‌ఎక్స్‌లెన్స్‌లో భాగంగా క్లినికల్ సైకాలజీ, సైక్రియాట్రిక్ సోషల్‌వర్క్, సైక్రియాట్రిక్ నర్సింగ్ కోర్సులను ప్రారంభించనున్నారు. ఒక్కో కోర్సులో గరిష్టంగా 30 మందికి ప్రవేశం కల్పిస్తారు. కోర్సుల నిర్వహణకు అవసరమైన ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీ త్వరలో జరగనున్నాయి. దాదాపు 19 మంది వరకు బోధన సిబ్బంది, క్లినికల్ సైకాలజీ ల్యాబ్ అసిస్టెంట్, లైబ్రేరియన్, సైక్రియాట్రి సోషల్ వర్కర్ వంటి ఉద్యోగాలు భర్తీ కావాల్సి ఉంది. వీటిని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ భర్తీ చేస్తుంది. ప్రస్తుతం మానసిక ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ఎం.డి సైక్రియార్టీ కోర్సుకు అదనంగా ఈ మూడు కోర్సులు రావడంతో మరింత బలోపేతం కానుంది.

మానసిక రుగ్మతల నివారణకు..

ప్రజల్లో పెరుగుతున్న మానసిక సమస్యలు, రుగ్మతల నివారణకు ఉపయుక్తంగా నూతన అకడమిక్ బ్లాక్ సేవలు అందించనుంది. దీనిలో ప్రత్యేకంగా డీ అడిక్షన్ విభాగం మత్తుపదార్థాలకు బానిసైన వారికి వైద్య సేవలు అందిస్తారు. ఈ వార్డును 40 బెడ్‌లతో ఏర్పాటు చేస్తున్నారు. చిన్నారుల్లో మానసిక సమస్యలు గుర్తించి సత్వరం చికిత్స, ఉపశమనం అందించే విధంగా చైల్డ్ సైక్రియార్టీ సేవలు 20 బెడ్‌లతో సిద్ధం చేస్తున్నారు. వృద్ధుల్లో వచ్చే మానసిక సమస్యలకు సైతం చికిత్స అందించే విధంగా జిరియార్టిక్ సైక్రియార్టీ వార్డ్‌ను ప్రత్యేకంగా 20 బెడ్‌లతో ఏర్పాటు చేస్తున్నారు. దీని వలన 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు సైతం ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుని చికిత్స అందించే అవకాశం ఏర్పడుతుంది.

మనోవికాస్..నూతన జీవితం

స్వల్పమానసిక సమస్యలు కలిగిన వారికి నూతన జీవితాన్ని అందించడం, సాధారణ జీవితం గడిపే విధంగా మనో వికాస్ విభాగం ఏర్పాటు అవుతోంది. దీనిలో భాగంగా మానసిక రోగులకు ఇది డే కేర్ సెంటర్‌గా నిలుస్తుంది. దీనిలో వారి సామర్థ్యాలకు అనుగుణంగా పేపర్ ప్లేట్లు తయారీ, బొమ్మల తయారీ, టైలరింగ్, క్యాండిల్స్ తయారీ వంటి అంశాలలో శిక్షణ ఇస్తారు. వాటిని విక్రయించగా వచ్చే లాభంతో కొంత వారికి అందిస్తారు. తద్వారా వీరు సమాజంలో కలవడానికి సాధారణ జీవితం గడపడానికి అవసరమైన నైపుణ్యాలను అందిస్తారు.

పేరుమార్పుకు ప్రతిపాదన

మానసిక ఆస్పత్రి అనగానే ప్రజల్లో ఉండే భయాన్ని రూపుమాపడానికి ఆ పేరును మార్చే ప్రతిపాదన ప్రభుత్వానికి పంపారు. వాల్తేర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ (విన్స్–ఆర్‌సీ)గా పేరును మార్పు చేయడానికి ప్రతిపాదన చేశారు. మానసిక ఆస్పత్రికి వచ్చామనే భావన రూపుమాపుతూ వారికి స్వాంతన అందించే విధంగా దీనిని తీర్చిదిద్దే దిశగా కృషిచేస్తున్నారు.

పూర్తిస్థాయిలో చికిత్సలు



వివిధ మానసిక సమస్యలతో ఇబ్బందుతు పడుతున్న వారికి అవసరమైన పూర్తి స్థాయి చికిత్స అందించి, వారికి స్వాంతన అందించడం లక్ష్యంగా పనిచేస్తున్నాం. నూతనంగా ఏర్పాటయ్యే సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ దీనిని సాకారం చేస్తుంది. మానసిక సమస్యను త్వరితగతిన గుర్తించడం, చికిత్స అందించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం వంటి ప్రక్రియలు అందుబాటులోకి రానున్నాయి.

– డాక్టర్ కేవీ రామి రెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి

నేడు ఉప ముఖ్యమంత్రి రాక

మహారాణిపేట: ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర సోమవారం విశాఖ రానున్నారు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ నుంచి విశాఖ వచ్చి నేరుగా ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో వడ్డాది, మాడుగుల ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. అక్కడ నుంచి సాలూరు వెళతారు.

నేడు డయల్ యువర్ ఆర్డీవో

మహారాణిపేట: డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమాన్ని సోమవారం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నట్టు ఆర్డీవో డి.హుస్సైన్ సాహెబ్ తెలిపారు. గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, మహారాణిపేట, ములగాడ, గోపాలపట్నం పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 0891–2562977 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలపవచ్చన్నారు.

నాలుగు గంటలు ఆలస్యంగా కోరమాండల్

తాటిచెట్లపాలెం : చెన్నై సెంట్రల్‌లో ఆదివారం ఉదయం 7గంటల కు బయల్దేరాల్సిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్– చెన్నై సెంట్రల్ (12842) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా ఉదయం 10.45 గంటలకు బయల్దేరింది. అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు రైలు చేరుకోనుంది.

యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


నగదు పురస్కారాలు అందజేస్తున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి

ఎంవీపీకాలనీ: జిల్లా యాదవ ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో యాదవ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి ముఖ్యఅతిథి హాజరై వీటిని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాదవ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సమాజంలో ఉన్నత వ్యక్తులుగా నిలిచేందుకు చదువు ఒక్కటే మార్గమన్నారు. 2023 ఏడాదికి సంబంధించి 10వ తరగతిలో 500, ఇంటర్‌లో 900లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 150 మందికి నగదు పురస్కారాలను అందజేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి డొక్కర శ్రీనివాసరావు మాట్లాడుతూ యాదవ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఏటా ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామన్నారు.

విశాఖ, అనకాపల్లి జిల్లాల పరిధిలో ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారాలతోపాటు కెరీర్ గైడెన్స్ బుక్స్, నోట్ బుక్స్, పెన్నులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఉరుకూటి రాజారావుతో పాటు మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, అక్కరమాని వెంకటరావు, ఒమ్మి సన్యాసిరావు, గొలగాని శ్రీనివాస్, మొల్లి అప్పారావు, పెగడ చిన్నారావు, పిన్నింటి వరలక్ష్మి, బొట్ట వెంకటరమణ, జగన్, తాతారావు, శ్రీరామ్ రవి, పీతల అప్పలరాజు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో డీఆర్ఎం చిత్రపటం


మిల్లెట్స్‌లో తయారుచేసిన డీఆర్ఎం చిత్రపటాన్ని బహూకరిస్తున్న మోకా విజయ్‌కుమార్


తాటిచెట్లపాలెం : చిరుధాన్యాలతో తయారు చేసిన డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి చిత్రపటాన్ని ఆయనకు బహూకరించారు కళాకారుడు మోకా విజయ్‌కుమార్. వాల్తేరు డివిజన్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న విజయ్ కుమార్ ఇప్పటికే చిరుధాన్యాలతో పలువురు చిత్రాలను రూపొందించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మోకా విజయ్‌కుమార్‌ను డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి అభినందించారు. డీఆర్ఎం చిత్రపటాన్ని తయారు చేయడానికి సుమారు 4 రోజులు పట్టిందని విజయ్ చెప్పారు.

108 జిల్లా నూతన కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

మహారాణిపేట: 108 నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు కుమార్ సమక్షంలో సీఐటీయూ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా ఎస్.బంగారురాజు, ఉపాధ్యక్షుడిగా వై.శివప్రసాద్, కార్యదర్శిగా కోటి నాయుడు, కోశాధికారిగా డి.సురేష్, రాష్ట్ర ఆఫీస్ బేరర్‌గా కె.రామకృష్ణరాజు, మహిళా కమిటీ సభ్యురాలుగా సీహెచ్ రమణమ్మ, డివిజనల్ సెక్రటరీలుగా టి.వాసుదేవరావు, సీహెచ్ సింహాద్రి నాయుడు ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు బి.శ్రీనివాసరావు, ఎస్.బంగారురాజు, బి.దుర్గారావు, జీటీఎస్ ప్రసాద్, త్రినాథ్, కేఆర్‌కే రాజు ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించారు.

ప్రకృతి సొగసు చూడతరమా!

అరకులోయ పరిసరాల్లో ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎటుచూసినా పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈ ప్రాంతానికి వచ్చే సందర్శకులు ఈ అందాలను తిలకించి మధురానుభూతి పొందుతున్నారు.

– అరకులోయ రూరల్

పర్యాటకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్


ఆర్కే బీచ్‌లో దీపక్‌తో లైఫ్‌గార్డ్స్


రుషికొండ తీరంలో అవతార్‌తో లైఫ్ గార్డ్స్

కొమ్మాది/బీచ్ రోడ్డు : రుషికొండ బీచ్, ఆర్కేబీచ్‌లో స్నానమాచరిస్తూ కెరటాల ఉధృతికి కొట్టుకుపోతున్న ఇద్దరు యువకులను లైఫ్‌గార్డ్స్ రక్షించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నలుగురు యువకులు ఆదివారం రుషికొండ బీచ్‌కు వచ్చారు. సాయంత్రం స్నానాలు చేసేందుకు ఇద్దరు బీచ్‌లోకి దిగారు. వీరిలో రామ్ అవతార్ ఉధృతంగా వచ్చిన అలలకు చిక్కుకుపోయాడు. లైఫ్‌గార్డ్స్ సూరాడ నూకరాజు, మైలిపిల్లి చందు అప్రమత్తమై అవతార్‌ను రక్షించారు. అలాగే ఒడిశాకు చెందిన దీపక్ ఆర్కేబీచ్‌లో కెరటాల ఉధృతికి కొట్టుకుపోయాడు. స్థానికులు పెద్దగా అరవడంతో బీచ్ లైఫ్ గార్డ్స్ నవీన్, పోలీరాజు, ధనరాజులు దీపక్‌ను కాపాడారు. ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు.

ఈట్ రైట్.. నో డౌట్

సాధారణంగా రైల్వేస్టేషన్లలో విక్రయించే ఆహార పదార్థాలు తినేందుకు చాలా మంది ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. నాణ్యతగా ఉండవని.. పరిశుభ్రత పాటించరని భయపడతారు. కానీ ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ప్రధాన రైల్వేస్టేషన్లలో ఇలాంటి సందేహమే అక్కర్లేదు. స్టేషన్‌లోని ఏ స్టాల్‌లోనైనా బ్రహ్మాండంగా నచ్చిన ఫుడ్ తినొచ్చు. ఇది స్వయంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సర్టిఫైడ్ చేసింది. ఈట్ రైట్ స్టేషన్ గుర్తింపులో భాగంగా విశాఖపట్నం గత ఏడాది సర్టిఫికెట్ దక్కించుకోగా.. తాజాగా విజయనగరం, శ్రీకాకుళం రైల్వేస్టేషన్లు ఈ జాబితాలో చేరాయి.

– సాక్షి, విశాఖపట్నం

సరిగ్గా తినండి.. సందేహం లేదు

- ఉత్తరాంధ్ర రైల్వే స్టేషన్లలో నాణ్యమైన ఆహారం
- ఆమోదముద్ర వేసిన ఎస్ఎస్ఎస్ఏఐ
- రాష్ట్రంలో మొట్టమొదటి ఈట్ రైట్ స్టేషన్‌గా విశాఖకు గుర్తింపు
- అదే బాటలో శ్రీకాకుళం, విజయనగరం స్టేషన్లకు సర్టిఫికెట్లు


విశాఖపట్నం రైల్వేస్టేషన్


శ్రీకాకుళం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న థర్డ్‌పార్టీ బృందం(ఫైల్)

దేశంలోని రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు సురక్షితమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో ఈట్‌రైట్ కార్యక్రమం ప్రారంభించారు. మూడేళ్ల కిందట మొదలైన ఈ కార్యక్రమంలో భాగంగా తొలి విడత ఏడు స్టేషన్లను ఈట్ రైట్ స్టేషన్లుగా సర్టిఫైడ్ చేశారు. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి ఒకే ఒక్క స్టేషన్ 4 స్టార్ రేటింగ్‌తో సర్టిఫికెట్ దక్కించుకుంది. టాప్–7 రైల్వేస్టేషన్లలో ఒకటిగా నిలిచిన విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో విక్రయించే ఆహార పదార్థాలను ఎలాంటి సందేహం లేకుండా తినవచ్చని ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆమోద ముద్ర వేసింది. తొలి విడతలో చండీగఢ్, ఢిల్లీలోని ఆనంద విహార్, ముంబయిలోని ఛత్రపతి శివాజీ టెర్మినల్, ముంబయి–సెంట్రల్ రైల్వే స్టేషన్, వడోదరా, భువనేశ్వర్‌తో పాటు విశాఖపట్నం ఎంపికయ్యాయి. ఈ స్టేషన్లకు సింగిల్ నుంచి ఫైవ్ స్టార్ వరకూ రేటింగ్ ఇవ్వగా.. విశాఖపట్నం 4 స్టార్ రేటింగ్ దక్కించుకుంది.

నిరంతరం తనిఖీలు

ఈట్ రైట్ స్టేషన్‌గా గుర్తింపు పొందాలనే ఉద్దేశంతో కాకుండా.. స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు నాణ్యమైన భోజనం, ఇతర తినుబండారాలు అందించాలన్న లక్ష్యంతో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి తనిఖీలు ప్రారంభించారు. కొన్ని సార్లు రాత్రి పూట కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి.. నాణ్యత పాటించని ఫుడ్‌స్టాల్‌పై చర్యలకు ఉపక్రమించేవారు. ఇదే ఈట్‌రైట్ సర్టిఫికెట్ పొందేందుకు కీలకంగా మారింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ బృందం విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆరు నెలల పాటు నిరంతరం తనిఖీలు చేపట్టింది. అయితే అప్పటికే సర్టిఫికెట్‌కు కావల్సిన ప్రమాణాలు స్టేషన్‌లో పాటించేలా డీఆర్ఎం చర్యలు తీసుకున్నారు. ఫలితంగా దేశంలో ఎన్నో ప్రధానమైన రైల్వేస్టేషన్లు ఉన్నప్పటికీ.. టాప్–7 స్టేషన్‌గా విశాఖపట్నం గుర్తింపు పొంది 4 స్టార్ రేటింగ్ సాధించింది.

అదే బాటలో సిక్కోలు.. విజయనగరం

ఒక్క విశాఖ మాత్రమే కాకుండా మిగిలిన స్టేషన్లలోనూ ఇలాంటి ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్టు డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి ఏడాది కిందటే ప్రకటించారు. ఇందులో భాగంగా విశాఖపట్నం స్టేషన్ సర్టిఫికెట్ పొందిన వెంటనే.. విజయనగరం, శ్రీకాకుళం స్టేషన్లపై దృష్టి సారించారు. ఈ క్రమంలో ఈ రెండు స్టేషన్లు కూడా ఈట్‌రైట్ స్టేషన్లుగా సర్టిఫికెట్ దక్కించుకున్నాయి.

ఏమిటీ ఈట్‌రైట్?

ఆహార భద్రత, ప్రమాణాల చట్టం–2006 ప్రకారం ప్రయాణికులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంలో బెంచ్‌మార్క్ నిర్ణయించే రైల్వే స్టేషన్లకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ద్వారా ఈట్‌రైట్ స్టేషన్‌గా గుర్తింపు లభిస్తుంది. ఎఫ్ఎస్ఎస్ఏఐ అనేది స్వయం ప్రతిపత్తి చట్టబద్ధమైన సంస్థ. ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎంప్యానెల్ చేసిన థర్డ్ పార్టీ ఆడిట్ ఏజెన్సీ సమగ్ర పరిశీలన అనంతరం 1 నుంచి 5 స్టార్ రేటింగ్‌లతో సర్టిఫికేషన్ ఇస్తుంది.

- ➡ స్థానిక ఫుడ్ సేఫ్టీ ఏజెన్సీలతో పాటు, రాష్ట్ర ఆహార భద్రత విభాగాలతో కలిసి స్టేషన్‌లోని ప్రతి ఫుడ్‌స్టాల్‌లోనూ ఆడిట్ నిర్వహిస్తారు.
- ➡ తనిఖీలు నిర్వహించే సమయంలో అక్కడ ఉన్న వినియోగదారులతో మాట్లాడి అభిప్రాయాలను సేకరిస్తారు. సంతృప్తికరంగా ఉందా లేదా అనే అంశాలను పరిశీలిస్తారు.
- ➡ ఫుడ్ స్టాళ్లలో ఉన్న ఫుడ్ హ్యాండ్లర్లకు శిక్షణ అందిస్తారు. అక్కడ మౌలిక వసతులు కల్పించే దిశగా ప్రోత్సహిస్తారు.
- ➡ ఇవన్నీ పూర్తి చేసిన ఆరు నెలలకు మరోసారి రాష్ట్ర ఆహార భద్రత విభాగాధికారులతో కలిసి తనిఖీలు నిర్వహిస్తారు. ఈ తనిఖీల్లో తాము సూచించిన విధంగా నియమ నిబంధనలు పాటిస్తున్నట్లు గుర్తిస్తే.. స్టార్ రేటింగ్ ఇస్తారు.
- ➡ ఈట్‌రైట్ స్టేషన్‌గా సర్టిఫైడ్ చేసిన తర్వాత నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ ఉంటారు. ప్రతి రెండేళ్ల కోసారి సర్టిఫికెట్‌ను రెన్యువల్ చేస్తారు.